సాక్షి
మహబూబాబాద్

సోమవారం । 16 । అక్టోబర్ । 2023



ఆడబిడ్డపై నిందలా... - 10లో▸

ఆడబిడ్డపై నిందలు వేయడం రాష్ట్ర ప్రభుత్వాని కి తగదని ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలీశర్మ అన్నారు. ప్రవళిక మృతికి గల కారణాల ను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.



అప్రమత్తత అవసరం - 10లో▸

చలికాలంలో జీవాలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, నిర్లక్ష్యం చేయకుండా నివారణ చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి మంజీలాల్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
$37.2^0/28.3^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరం గా ఉంటుంది. ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

మహబూబాబాద్‌: అసెంబ్లీ ఎన్నికల ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులందరూ ఎలక్షన్ విధుల విధుల్లో నిమగ్నం కావడంతో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ శశాంక ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించి వినతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని ఆయన కోరారు.

ఎన్నికల ఖర్చులు తప్పకుండా చూపాలి



గూడూరు: ఎన్నికలు పూర్తయ్యే వరకు ఏరోజు ఖర్చులను ఆరోజు విధిగా రిజిస్టర్‌లో చూపాలని జిల్లా ఎన్నికల ఖర్చుల సహాయ పరిశీలన అధికారి కుర్షిద్ అన్నారు. మండలంలోని భూపతిపేట వద్ద ఏర్పాటు చేసిన ఫారెస్టు చెక్‌పోస్టును ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజు విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది పెడుతున్న ఖర్చులు, తనిఖీలో పట్టుబడిన డబ్బుల వివరాల రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో కేసముద్రం ఎంపీఓ రఘుపతిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిరప రైతులను ఆదుకోవాలి



డోర్నకల్‌: గుబ్బరోగంతో పాటు పలు రకాల తెగుళ్లసోకి నష్టపోయిన మిరప పంట రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బ వెంకటరెడ్డి కోరారు. మండలంలోని చిలుకోడు, బూరుగుపాడు, వెన్నారం, ఉయ్యాలవాడ గ్రామాల పరిధిలో మిరపతోటలను ఆదివారం రైతు సంఘం, సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బొబ్బ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో గుబ్బ రోగంతో పాటు ఇతర తెగుళ్లతో మిరప తోటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలని కోరారు. వ్యవసాయ అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించి మిరప తోటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బోయినపల్లి దేవేందర్, ఉపేందర్, రమేష్, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు విఘాతం కలిగిస్తే చర్యలు



దంతాలపల్లి: జిల్లాలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వర బాబు అన్నారు. ఆదివారం మండలంలోని దాట్ల గ్రామంలో ఎన్నికలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు తప్పవన్నారు. ఎలాంటి పంచాయితీలు లేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని బెల్టుషాపుల్లో తనిఖీలు నిర్వహించి సుమారు రూ. 25వేల విలువ గల మద్యం, బీరుసీసాలను స్వాధీనం చేసుకొని, బెల్టుషాపు యజమాని రేసు మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు సీఐ సత్యనారాయణ, ఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీసీఎస్ అభివృద్ధికి కృషి



దోర్నకల్ : మజ్దూర్ యూనియన్ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ(సీసీఎస్) అభివృద్ధికి కృషి చేస్తామని మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ రవీందర్ తెలిపారు. స్థానిక మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన యూనియన్ సీసీఎస్ ఎన్నికల శంఖారావంలో రవీందర్ మాట్లాడారు. కార్మికులు అహర్నిశలు శ్రమించి సీసీఎస్‌లో దాచుకున్న సొమ్ముకు భద్రత లేకుండా పోయిందన్నారు. అవినీతిని నిర్మూలించాలంటే సీసీఎస్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

జనగామ నుంచి
ఎన్నికల శంఖారావం

ఉమ్మడి వరంగల్‌లో నేడు కేసీఆర్ తొలి ఎన్నికల ప్రచారసభ

- జన సమీకరణకు భారీగా ఏర్పాట్లు
- బీఆర్‌ఎస్‌లో చేరనున్న పొన్నాల లక్ష్మయ్య
- ప్రతిష్టాత్మకంగా జనగామ ప్రజా ఆశీర్వాద సభ



సాక్షిప్రతినిధి, వరంగల్: గులాబీ దళపతి, ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం జనగామ నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. ఉమ్మడి వరంగల్ పరిధి 12 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన తర్వాత తొలి ప్రచార సభను జనగామ కేంద్రంగా నిర్వహిస్తున్నారు. జనగామలో సిద్దిపేట రోడ్డున మెడికల్ కాలేజీ మైదానంలో బీఆర్‌ఎస్ ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు వేదిక సిద్ధమైంది. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను మూడు రోజులుగా పరిశీలిస్తున్నారు. ఉమ్మడి వరంగల్‌లో సీఎం కేసీఆర్ తొలి ప్రచారసభ విజయవంతానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సన్నాహక సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల సందర్భంగా వరంగల్‌లో సభ నిర్వహించిన కేసీఆర్.. ఈసారి జనగామను ఎంచుకున్నారు. 27న అదే జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో మరో సభ నిర్వహించనున్నారు.

ప్రతిష్టాత్మకంగా జనగామ సభ

ఉద్యమాల పురిటిగడ్డ, పోరాటాల ఖిల్లా ఉమ్మడి వరంగల్‌లో జనగామ కేంద్రంగా నిర్వహించే సభను పార్టీ అధిష్టానం, నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్‌తో పాటు సిద్దిపేట తదితర ప్రాంతాలపై ప్రభావం చూపనున్న నేపథ్యంలో భారీ జన సమీకరణపై పార్టీ నేతలు దృష్టి సారించారు. వరంగల్ అంటే కేసీఆర్‌కు ఒకరకంగా సెంటిమెంట్. జన సమీకరణ, బల ప్రదర్శన ద్వారా ఉద్యమ సత్తాను చాటేందుకు ఇక్కడి నుంచే సభలు నిర్వహించేవారు. వాస్తవానికి అక్టోబర్ 16న వరంగల్ నగరంలోని ఉనికిచర్ల ప్రాంతంలో భారీ బహిరంగసభ నిర్వహించి ఎన్నికల మేనిఫెస్టో ఇక్కడే ప్రకటించాలని నిర్ణయించారు. అయితే ప్రగతిభవన్‌లో మేనిఫెస్టోను ప్రకటించిన కేసీఆర్.. హుస్నాబాద్‌లో సభ నిర్వహించారు. ముందుగా ప్రకటించిన విధంగా వరంగల్‌లో కాకుండా జనగామలో సభ ఏర్పాటు చేశారు. అన్నిరకాలుగా కలిసొచ్చే ప్రాంతం, సెంటిమెంట్‌గా భావించే సీఎం కేసీఆర్‌కు ఓరుగల్లంటే అమితమైన ప్రేమ. 2014, 2018 ఎన్నికల సందర్భంగా ఎక్కువ సమయం ఇక్కడే కేటాయించారు. ఈసారి ఉమ్మడి వరంగల్‌లో తొలి ప్రచార, ప్రజాశీర్వాద సభకు జనగామ ను ఎంచుకున్నారు.

12 స్థానాల్లో గెలుపే లక్ష్యం..

నవంబర్ 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ పరిధి 12 స్థానాల్లో పాగా వేయడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పావులు కదుపుతోంది. గత ఎన్నికల్లో 12 స్థానాల్లో 10 బీఆర్‌ఎస్ గెలుపొందగా, భూపాలపల్లి, ములుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. భూపాలపల్లి నుంచి గెలుపొందిన గండ్ర వెంకటరమణారెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరగా.. ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క ఈసారి కూడా కాంగ్రెస్ నుంచే తలపడుతోంది. అయితే ఈసారి ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్న కేసీఆర్.. తొలిసభను జనగామలో, మరోసభను స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించేలా ప్లాన్ చేశారు. కాగా.. 14 ఏళ్ల ఉద్యమం కొనసాగించి ప్రత్యేక రాష్ట్రం సాధించి తొమ్మిదిన్నరేళ్ల విజయవంతమైన పాలన.. ఉమ్మడి వరంగల్‌లో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేసీఆర్ జనగామ సభ నుంచి ప్రజలకు వివరించనున్నారు.

నేడు బీఆర్‌ఎస్‌లోకి పొన్నాల

సోమవారం జనగామలో సిద్దిపేట రోడ్డులోని మెడికల్ కళాశాల మైదానం వేదిక నుంచే ఉమ్మడి జిల్లా ఎన్నికల శంఖారావం పూరించనున్న కేసీఆర్.. మాజీ మంత్రి, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యను బీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకోనున్నారు. రెండ్రోజుల క్రితం పార్టీని వీడిన పొన్నాల ఆదివారం కేటీఆర్, కేసీఆర్‌ను కలిశారు. ఈ మేరకు జనగామ సభలో తన అనుచరులు, పార్టీ కార్యకర్తలతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



సిద్ధమైన హెలిపాడ్



సభా ప్రాంగణంలో కటౌట్లు


సభకు సర్వం సిద్ధం

- 1.30 గంటలకు హెలికాప్టర్‌లో సీఎం ల్యాండింగ్
- మధ్యాహ్నం 2 గంటలకు ప్రజా ఆశీర్వాద సభ

జనగామ: సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు జనగామ జిల్లా కేంద్రం మెడికల్ కళాశాల మైదానం సిద్ధమైంది. మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ సభ జరగనుండగా.. మధ్యాహ్నం 1.30 గంటలకు కేసీఆర్ వికాస్‌నగర్‌లోని హెలిపాడ్ వద్ద దిగుతారు. అక్కడి నుంచి అరకిలో మీటరు దూరంలోని సభా వేదిక వద్దకు ప్రత్యేక కాన్వాయ్ ద్వారా చేరుకుంటారు. సభా ప్రాంగణం పక్కన ఏర్పాటు చేసిన విశ్రాంతి గదిలో సేదదీరి వేదికకు చేరుకుంటారు. సభా ప్రాంగణం, వేదికను వరంగల్ ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆర్.భాస్కర్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ ఎల్లయ్యతో కలిసి పరిశీలించారు.

వీడని ఉత్కంఠ..

- కాంగ్రెస్ తొలి జాబితాలో లేని జిల్లా అభ్యర్థుల పేర్లు
- బీఫాంలు అందకపోవడంతో బీఆర్‌ఎస్ నేతల్లో ఆందోళన



సాక్షి,మహబూబాబాద్‌: కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన అభ్యర్థుల తొలి జాబితాలో జిల్లా నేతల ఊసే లేదు. అలాగే బీఆర్‌ఎస్ అధినేత నుంచి జిల్లాలో ఎవరికీ బీఫాంలు అందలేదు. తొలి జాబితాలో పేర్లు రాకపోవడంతో ఇటు కాంగ్రెస్, అటు బీఆర్‌ఎస్ నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.

వారి ఊసేలేదు..

సీఎం కేసీఆర్ జిల్లాలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇస్తామని ప్రకటించారు. ఈ మేరకు మహబూబాబాద్ నుంచి శంకర్‌నాయక్, డోర్నకల్ నుంచి రెడ్యానాయక్, పాలకుర్తి నుంచి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం సీఎం కేసీఆర్ కొంతమంది అభ్యర్థులకు బీఫాం అందజేయగా.. అందులో జిల్లావారు లేకపోవడం గమనార్హం. కాగా మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో నిర్వహించిన సర్వేలో ఆశాజనకమైన ఫలితాలు రాలేదని తెలిసింది. ఈమేరకు బీఫాం ఇచ్చిన జాబితాలో జిల్లా నాయకుల పేర్లు లేకపోవడం చర్చగా మారింది.

వీడని కాంగ్రెస్ పీటముడి..

కాంగ్రెస్ ఆదివారం 55మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో జిల్లా నుంచి ఒకరికి కూడా స్థానం కల్పించలేదు. పాలకుర్తి నుంచి ఝాన్సీరెడ్డి, మహబూబాబాద్ నుంచి మురళీనాయక్, డోర్నకల్ నుంచి రాంచంద్రు నాయక్‌కు టికెట్లు ఖరారయ్యాయనే ప్రచారం జరిగింది. ఆయా స్థానాల్లో పోటీ పడుతున్న తిరుపతిరెడ్డి, నెహ్రూ నాయక్‌కు పార్టీ అధికారంలోకి వస్తే ప్రాధాన్యత కల్పిస్తామని హామీలు ఇచ్చినట్లు ప్రచారం. మానుకోట నుంచి పోటీ పడుతున్న బలరాంనాయక్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ పడాలని అధిష్టానం నచ్చజెప్పినట్లు సోషల్ మీడియాలో వార్తలొచ్చాయి. అయితే ఇందుకు వారు సానుకూలంగా స్పందించారని కొందరు చెబుతుంటే.. లేదు లేదు టికెట్లు వాళ్లకే వస్తాయని బలరాంనాయక్, నెహ్రూ నాయక్, తిరుపతిరెడ్డి వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తామని చెప్పిన ఏఐసీసీ నాయకులు మురళీనాయక్, రాంచంద్రునాయక్, ఝాన్సీరెడ్డిని ప్రచారం చేసుకోవాలని కూడా చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో విడుదల చేసిన జాబితా జిల్లా నాయకుల ఊసేలేదు. దీంతో టికెట్ వస్తుందా రాదా అనే ఉత్కంఠలో ఆశావహులు ఉన్నారు.

18న రాహుల్‌గాంధీ పర్యటన

- ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల అభ్యర్థులతో బహిరంగ సభ
- భూపాలపల్లిలో నిరుద్యోగులతో కలిసి పాదయాత్ర

భూపాలపల్లి అర్బన్/వెంకటాపురం(ఎం): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ యువనేత, ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఈనెల 18న పర్యటించనున్నారు. ముందుగా వెంకటాపురం(ఎం) మండలం పాలంపేటలోని రామప్ప ఆలయాన్ని సందర్శించనున్నారు. అనంతరం భూపాలపల్లి, ములుగు నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులు గండ్ర సత్యనారాయణరావు, సీతక్క ఆధ్వర్యంలో రామనుజపూర్–వెల్తుర్లపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు బహిరంగ సభలో ఓటర్లను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత భూపాలపల్లిలో నిరుద్యోగులతో కలిసి రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పాదయాత్ర నిర్వహించి వారితో మాట్లాడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా రామానుజపూర్‌లో సభ నిర్వహించేందుకు ఆదివారం గండ్ర స్థలాన్ని పరిశీలించారు.

సీఎం కేసీఆర్‌కు గుణపాఠం తప్పదు

మహబూబాబాద్ అర్బన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం తప్పదని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధి జామండ్లపల్లిలో ఆదివారం ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానుకోట పట్టణశివారు వార్డులు, కాలనీల్లో అభివృద్ధి శూన్యమని, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందించలేదని, బీఆర్‌ఎస్ పార్టీ వాళ్లకు మాత్రమే అందించారని ఆరోపించారు. మానుకోట ప్రజలందరూ తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ఎర్రం రెడ్డి సిద్దార్థ రెడ్డి, మానుకోట పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్, జమాండ్లపల్లి శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ సుధాకర్ నాయక్, బూత్ అధ్యక్షుడు తాటి వేణు, నాయకులు వీరమల్ల ప్రేమ్ కుమార్, చీకటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న హుస్సేన్‌నాయక్

బీజేపీ పాలన కోరుకుంటున్నారు..

ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షతన మానుకోట నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం



అండర్‌–19 విభాగంలో విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ బాలికల జట్టు



అండర్‌–17 విభాగంలో విజేతగా నిలిచిన నిజామాబాద్ బాలుర జట్టు

తొర్రూరు: క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి అన్నారు. కొద్ది రోజులుగా డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్క్‌లో ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 67వ రాష్ట్రస్థాయి 17, 19 ఏళ్ల బాలబాలికల రగ్బీ క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో 10 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్‌–19 బాలుర విభాగంలో నల్లగొండ జిల్లా విజేతగా నిలిచింది. రన్నరప్‌గా రంగారెడ్డి జిల్లా నిలిచింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ విజేతగా నిలవగా ద్వితీయ స్థానంలో మెదక్ నిలిచింది. అండర్‌–17 బాలుర విభాగంలో మొదటి స్థానంలో నిజామాబాద్, ద్వితీయ స్థానంలో నల్లగొండ నిలిచింది. అలాగే బాలికల విభాగంలో మహబూబ్‌నగర్, ద్వితీయ స్థానం నల్లగొండ నిలిచింది. ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ.. జిల్లా క్రీడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో మినీ స్టేడియాల నిర్మాణం చేస్తుందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, క్రీడా కన్వీనర్ చెడుపల్లి ఐలయ్య, రాష్ట్ర పరిశీలకులు యూసఫ్‌ఖాన్, రమేష్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సునీల్, రమో శ్రీనివాస్, మాధవి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

‘లంబాడీలను గుర్తించడం లేదు’

కొత్తగూడ : ములుగు నియోజక వర్గంలో లంబాడీలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన లంబాడీ నాయకులు తిరుగుబాటు చేశారు. రేణ్యతండా సర్పంచ్ రమేశ్ ఆధ్వర్యంలో సుమారు 15మంది నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు సోషల్ మీడియాలో వార్తలొచ్చాయి. పార్టీలో కొనసాగుతున్న వివక్షపై ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి స్పందించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అందుకు తమ కార్యాచరణ రూపొందించేందుకు నందానాయక్, రాజన్నలకు బాధ్యతలు అప్పగిస్తూ తీర్మానం చేసుకున్నారు. ఈ సమావేశంలో పొగుళ్లపల్లి సర్పంచ్ భర్త రవి, చెరువుముందు తండా సర్పంచ్ కుమారుడు జాటోత్ రవి, గుంజేడు సర్పంచ్ భర్త రమేష్‌లతో పాటు వివిధ స్థాయిల్లో బీఆర్‌ఎస్ పార్టీలో పని చేస్తున్న నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ రమేశ్

క్రమబద్ధీకరణకు రీ సర్వే..

- మానుకోట మున్సిపాలిటీలో జీఓ 59కింద దరఖాస్తుల పరిశీలన పూర్తి
- తప్పిదాలు జరగడంతో రీసర్వేకు కలెక్టర్ ఆదేశాలు
- ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై లబ్ధిదారుల్లో ఆశలు

మహబూబాబాద్‌: ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీఓ 58,59 విడుదల చేసింది. కాగా జీఓ 59 ద్వారా క్రమబద్ధీకరణకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుసుము చెల్లించాల్సి ఉంది. కాగా మానుకోట మున్సిపాలిటీలో మొదటి సర్వే పూర్తిచేసి లక్షల్లో చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. అయితే ఆ భూములు అమ్మినా నోటీసుల్లో పేర్కొన్న డబ్బులు రావని పేదలు కొన్ని నెలలుగా ఆందోళనలు చేస్తున్నారు. కాగా ఈ విషయంపై కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించగా మొదటి సర్వేలో జరిగిన తప్పిదాలు బయటపడ్డాయి. దీంతో కలెక్టర్ రీసర్వేకు ఆదేశించారు. కాగా రీ సర్వే ద్వారా ఇస్తున్న నోటీస్‌లో పేర్కొన్న రుసుముకు మొదటి సర్వే నోటీస్‌లో తెలిపిన రుసుముకు చాలా వ్యత్యాసం కనిపిస్తోంది.

కలెక్టర్ ఆదేశాలతో..

2014 జూన్ 2వ తేదీ కంటే ముందు ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాల క్రమబద్ధీకరణ(125గజాల కంటే ఎక్కువ) జీఓ 59 విడుదల చేశారు. కాగా జిల్లా వ్యాప్తంగా 1,800 దరఖాస్తులు వచ్చాయి. మానుకోట మండలంలో 1,371 దరఖాస్తులు వచ్చాయి. కాగా మానుకోట మున్సిపాలిటీలోని దరఖాస్తుల సర్వే పూర్తిచేసి నోటీసులు అందించారు. అయితే నోటీసుల్లో పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని తెలపడంతో దరఖాస్తుదారులు వెనకడుగు వేశారు. అంత మొత్తం చెల్లించలేమని రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేశారు. ఈ క్రమంలో అధికారులు జేసీబీలతో దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు కూల్చివేతలకు వెళ్లగా.. అడ్డుకొని వాగ్వాదం చేయడంతో అధికారులు వెనుదిగిని వెళ్లిన ఘటనలు ఉన్నాయి. ఈ విషయంపై కలెక్టర్ శశాంక పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించగా.. సర్వేలో జరిగిన తప్పిదాలను గుర్తించి రీ సర్వే చేయాలని ఆదేశించారు.



మానుకోట మున్సిపాలిటీలో రీ సర్వే చేస్తున్న అధికారులు

సర్దుబాటు ప్రక్రియ

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై ఇటీవల కలెక్టర్ శశాంక మానుకోట మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కమిషనర్ ప్రసన్నరాణితో పాటు కౌన్సిలర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి సర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేయాలని ఆదేశించారు. కాగా మొదటి సర్వేలో రోడ్డు పక్కనే ఉన్న ఇంటి నంబర్‌కు దానికి దూరంగా బైనంబర్‌తో ఉన్న ఇంటికి ఒకే మాదిరిగా రుసుము కేటాయించారు. ఇలాంటి తప్పిదాల వల్ల దరఖాస్తుదారులు రుసుము చెల్లించి క్రమబద్ధీకరణకు ముందుకు రావడం లేదని, రీసర్వే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. దీంతో మొదటి నోటీస్‌లో డబ్బులను సవరణ చేసి మరో డిమాండ్ నోటీస్ ఇస్తున్నారు. కాగా మానుకోట మున్సిపాలిటీలో ఇప్పటివరకు 204 దరఖాస్తులకు 86 దరఖాస్తుల రీ సర్వే పూర్తి చేశారు.

ప్రత్యేక బృందాలు..

మున్సిపాలిటీలో రీ సర్వేతో పాటు నోటీస్‌లు ఇచ్చి డబ్బులు వసూల్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీరోజు రీసర్వే చేసి డబ్బులు వసూల్ చేస్తున్నారు. ఏరోజు నివేదికను ఆరోజే కలెక్టర్ కార్యాలయంలో అందజేస్తున్నారు. మూడు దఫాల్లో మొత్తం రుసుము చెల్లించవచ్చని, ప్రస్తుతం మొదటి దఫా చెల్లించాలని సూచిస్తున్నారు. మొండిగా వ్యవహరించేవారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎలాంటి మాఫీ ఉండదని, రుసుము చెల్లిస్తేనే సర్వహక్కులు వస్తాయని, బ్యాంకు రుణాలు తీసుకోవచ్చని, మార్టిగేజ్ చేసుకోవచ్చని పేర్కొంటున్నారు.

మొదటి సర్వేలో తప్పిదాలు

జీఓ 59కింద మొదట చేసిన సర్వేలో తప్పిదాలు జరిగాయి. సవరణకు రీ సర్వే చేసి మళ్లీ నోటీసులు ఇస్తున్నారు. రెండోసారి ఇచ్చిన నోటీస్‌ల రుసుము మొదటి దానితో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. దరఖాస్తులు సద్వినియోగం చేసుకోవాలి. రుసుము చెల్లించకుంటే కూల్చివేతలు తప్పవు.

-అలివేలు, ఆర్డీఓ

రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

కురవి : మండలంలోని మోద్గులగూడెం శివారు బేగావత్ తండాలో బంజారా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబాబాద్ సహకారంతో స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ అంబరీష, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.వరప్రసాద్, ఎం.వెంకటరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, హితేష్‌కుమార్ పాల్గొన్నారు. రక్తదానం చేసిన యువకులకు ప్రశంస పత్రాలను అందజేశారు.

ఆర్టీసీ గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్

నెహ్రూసెంటర్: టీఎస్ ఆర్టీసీ చేపట్టిన గ్రాండ్ ఫెస్టివల్ వంద రోజుల చాలెంజ్ (జీఎఫ్‌సీ) కార్యక్రమాన్ని మానుకోట డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో జీఎఫ్‌సీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డీఎం మాట్లాడుతూ.. ఈ నెల 15నుంచి జనవరి 22వ తేదీ వరకు వంద రోజుల చాలెంజ్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండుగల నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో అత్యధిక ప్రయాణికులను ఎక్కించుకుని ఎక్కువ ఆదాయం తీసుకురావాలని ఉద్యోగులకు సూచించారు. మానుకోట డిపోను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండేలా ఆర్టీసీ ఉద్యోగులందరూ కృషి చేయాలని కోరారు.

ప్రత్యేక బస్సులు..

మహబూబాబాద్ డిపో నుంచి హైదరాబాద్‌కు ఆదివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు 5 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డీఎం తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీని ఆధారించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అదే విధంగా రాఖీ పండుగ సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా మాదిరిగానే ఈ నెల 21నుంచి 23వ తేదీ వరకు, 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు లక్కీ డ్రా నిర్వహిస్తామని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన పురుషులు, స్త్రీలు తమ టికెట్లను ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని గిఫ్ట్ బాక్సుల్లో వేయాలని సూచించారు. డ్రాలో గెలుపొందిన ఐదుగురు పురుషులు, ఐదుగురు స్త్రీలకు ఒక్కొక్కరికి రూ.9,900 నగదు బహుమతి అందిస్తామన్నారు.



మాట్లాడుతున్న డీఎం శివప్రసాద్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

● బోరునర్సాపురంలో ఘటన



దుర్గం సత్యం (ఫైల్)

మంగపేట: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని బోరునర్సాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన దుర్గం సత్యం(54) బుచ్చంపేట జీపీ పరిధిలోని జబ్బోనిగూడెం శివారులో రెండున్నర ఎకరాల్లో మిర్చి, ఎకరం భూమిలో వరి సాగు చేశాడు. చేనుకు నీరు పారించేందుకు వెళ్లిన సత్యం.. పొలంలోని విద్యుత్ మోటార్‌కు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అమర్చిన తీగలను సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో షాక్‌గురై మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు అరుణ్‌కుమార్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా, గతేడాది మే నెలలో అకాల వర్షాలకు మృతుడి చేను వద్ద విద్యుత్ లైన్ స్తంభాలు విరిగాయి. అప్పటి నుంచి అధికారులు స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సుమారు 800 మీటర్ల దూరం నుంచి మోటార్ వద్దకు మృతుడు తీగలు అమర్చాడు. ఈ తీగలను కలుపుతున్న క్రమంలో షాక్‌గురై మృతి చెందాడని, స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు అధికారులే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

గుండెపోటుతో..



ఆకుల సత్యం (ఫైల్)

ఏటూరునాగారం: మిర్చి తోటకు తడి కడుతూ ఓ రైతు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఆకుల సత్యం (75) శనివారం తన మిర్చి తోట వద్ద పనులు చేస్తూ గుండెలో నొప్పి ఉందని అక్కడే కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు, రైతులు గమనించి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

డెంగీతో యువకుడు..



రాజు (ఫైల్)

భూపాలపల్లి అర్బన్: డెంగీ జ్వరంతో యువకుడు మృతి చెందిన సంఘటన మునిసిపాలిటీ పరిధిలోని వేశాలపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేశాల రాజు(32) గత నెల రోజులుగా జ్వరంతో బాధపడుతూ గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొందినట్లు తెలిసింది. జ్వరం తీవ్రంగా ఉండడంతో హనుమకొండ, వరంగల్‌లో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించగా పరిస్థితి విషమించిందని వైద్యులు సూచించడంతో హైదరాబాద్ యశోద ఆస్పత్రికి వారం రోజుల క్రితం తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అప్రమత్తత అవసరం..

● చలికాలంలో జీవాల పట్ల జాగ్రత్తగా ఉండాలి
● రోగాల బారిన పడితే నిర్లక్ష్యం చేయొద్దు
● పశువైద్యుడు మంజీలాల్



జీవాలు



డాక్టర్ మంజీలాల్

చెన్నారావుపేట: వాతావరణంలో మార్పులు సంభవించడంతో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాలతో సతమతమవుతున్నారు. అలాగే, జీవాలు కూడా వాతావరణంలో వచ్చే మార్పులతో పలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. వాటి పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. చలికాలం ప్రారంభమైన నేపథ్యంలో గొర్రెలు, మేకల్లో దొమ్మ వ్యాధి (నిమ్ము), జలుబు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జీవాలను కాపాడుకోవడంలో కాపరులు జాగ్రత్తగా ఉండాలి. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి నివారణ చర్యలు చేపట్టాలని చెన్నారావుపేట పశువైద్యాధికారి మంజీలాల్ పలు సూచనలు చేశారు. చలికాలంలో జీవాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వ్యాధి..

దొమ్మరోగం అనేక రకాలు ఉంటుంది. బ్యాక్టీరియాలు, వైరస్‌లు, పరాన్నజీవులు దీనికి కారణమవుతున్నాయి. కంటేజీయస్ కాప్రైన్ ప్లూరో నిమోనియా (సీసీసీపీ) అనే వైరస్ కారణంగా మేకలకు మాత్రమే తరుచూ ఈ వ్యాధి వస్తుంది.

లక్షణాలు..

జ్వరం తీవ్రత అధికంగా ఉంటుంది. వేగంగా శ్వాస పీల్చుకోవడం, ఎగశ్వాస, ముక్కు నుంచి నీరు చిక్కటి చీమిడి కారడం, ఆకలి లేకపోవడం రోజురోజుకూ నీరసం ఉంటుంది. కళ్లు ఎర్రబడి నీరు కారడం, వీపుభాగం ఒంగి ఉండడం, తల, మెడ ముందుకు సాగినట్లు కనిపించడంతో పాటు ముక్కు రంధ్రాలు వెడల్పు అవుతాయి. త్వరగా చికిత్స చేయించకపోతే ఊపిరితిత్తులు వాచి వాటికి చీము పడుతుంది. ఈ లక్షణాలు కనిపిస్తే దొమ్మ రోగంగా నిర్ధారణకు కావొద్దు. ఈ లక్షణాలు అమ్మతల్లి, వీపీఆర్ మొదలైన జబ్బుల్లో కూడా కనిపిస్తాయి. పెంపకందారులు జీవాలను వైద్యుడి వద్దకు తీసుకెళ్లి దొమ్మ రోగమా కాదా అని నిర్ధారించుకున్న తరువాత చికిత్స చేయించాలి.

జాగ్రత్తలు..

వాతావరణంలో వచ్చే మార్పుల నుంచి జీవాలను రక్షించాలి. అధిక వర్షం, చలి నుంచి పిల్లలను సంరక్షించాలి. ఆరోగ్యంగా ఉన్న జీవాలను జబ్బుపడిన పశువులకు దూరంగా ఉంచాలి. ఎప్పటికప్పుడు నట్టల నివారణ మందు వేయాలి. అంటు వ్యాధులకు టీకాలు వేయించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన నీటిని ఇవ్వాలి.

జలుబు, దగ్గు..

ఈ వ్యాధి సోకినప్పుడు పశువులకు తుమ్ములు, కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, చీమిడి పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. పశువుల పాక ఇరుకుగా ఉండడం, గాలి వెలుతురు సరిగా లేకపోవడం, పాకాలో తేమ/తడి ఎక్కువగా ఉంటడం కాలుష్యం, దుమ్మ వాతావరణంలో వచ్చే మార్పులు ఈ జబ్బుకు కారణమవుతుంటాయి. అలాగే, క్రిముల ద్వారా సోకే అంటు వ్యాధులు ఉండడం, బయట నుంచి శ్వాస కోశలోకి వచ్చే కణాలు, నూనె పదార్థం శ్వాసకోశను చికాకు పెట్టే ఇతర పదార్థాలు కూడా జలుబు/దగ్గు వ్యాధికి కారణమవుతాయి.

నివారణ..

పశువుల పాకలోకి గాలి, వెలుతురు సరిగా ప్రసరించేలా చూడాలి. మంచు.. జీవాలపై పడకుండా చూడాలి. వాతావరణం బాగాలేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకను శుభ్రంగా ఉంచాలి.

నట్టల నివారణకు మందు వేయాలి..

జబ్బు సోకినప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలి. ఒక వేళ జీవి మృత్యువాత పడితే పోస్టుమార్టం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి మందలోని మిగిలిన జీవులకు తగిన చికిత్స చేయిచాలి. ఈ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా దొమ్మ టీకా వేయించాలి.

ఆడబిడ్డపై నిందలా.. ఇదెక్కడి న్యాయం



ప్రవళిక పోటీ పరీక్షల పుస్తకాలను పరిశీలిస్తున్న డాలీశర్మ, కాంగ్రెస్ నాయకులు

● ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎంపీ డాలీశర్మ
● ప్రవళిక కుటుంబానికి పరామర్శ

దుగ్గొండి: ఆడబిడ్డపై నిందలు వేయడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తగదని, యువత చేతిలో మూల్యం తప్పదని ఏఐసీసీ అధికార ప్రతినిధి, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ఎంపీ డాలీశర్మ అన్నారు. అభివృద్ధిలో దేశం.. తెలంగాణ వైపు చూస్తోందని గొప్పలు చెప్పుకొట్టుకుంటున్న బీఆర్‌ఎస్‌ను ఇప్పుడు ప్రవల్లిక రూపంలో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందని ఎద్దేవా చేశారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన ప్రవళిక రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడగా బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. మృతురాలి తల్లి విజయ, తండ్రి లింగయ్యను ఓదార్చారు. ప్రవళిక మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తమ బిడ్డ కోచింగ్ తీసుకుంటున్న మాట వాస్తమవని, ప్రేమ పేరుతో తన కూతురుపై నిందమోపారని ఆ నింద రాకుండా చూడాలని ప్రవళిక తల్లి విజయ బోరున విలపించింది. దీనిపై డాలీశర్మ స్పందిస్తూ అధైర్య పడొద్దని రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ స్వయంగా తనను పంపారని, తాము అండగా ఉంటామని బరోసా ఇచ్చారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాలీశర్మ మాట్లాడారు. ఓ యువతి పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ ఆత్మహత్య చేసుకుంటే పోలీసులు దానికి ప్రేమపేరుపెట్టి అవమాన పరచడం సిగ్గు చేటన్నారు. ఆడపిల్ల క్యారెక్టర్‌ను సమాజంలో బహిర్గత పరచడం చట్టరీత్యా నేరమని, అందుకు కారకులైన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంత ధైర్యం ఉంటే ఆడపిల్లను అపహాస్యం చేస్తారని మండిపడ్డారు. నిరుద్యోగుల పట్ల తమ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి ప్రభుత్వం ప్రవల్లిక ఆత్మహత్యను బాయ్‌ఫ్రెండ్‌ను బూచిగా చూపడం దురదృష్టకరమన్నారు. ముమ్మాటికీ ప్రవళికది ప్రభుత్వ హత్యేనని, అందుకు బాధిత కుటుంబంలో ఒకరి ఉద్యోగంతో పాటు ఆర్థిక సాయం అందించాలని ఆమె డిమాండ్ చేశారు.

మిస్టర్‌రెడ్డి.. సాయం చేయండి

ప్రవళిక కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న క్రమంలో డాలీశర్మ.. నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డిని ఉద్దేశించి మిస్టర్ రెడ్డి.. బాధిత కుటుంబానికి అండగా ఉండి అన్ని విధాలా సాయం చేయండి అని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ స్వప్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్, ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, తోకల శ్రీనివాసరెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, రామానంద్, నర్సింగరావు, కిరణ్‌రెడ్డి, పెండ్యాల రాజు, బండారి రమేష్ పాల్గొన్నారు.

ఫోన్‌లో మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

ప్రవళిక కుటుంబ సభ్యులను ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్ర ఎంపీ డాలీశర్మ పరామర్శిస్తున్న క్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్.. మృతురాలి తల్లిదండ్రులతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. నేను వస్తా.. బిడ్డపై కేసీఆర్ ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేసి అవమానానికి గురిచేసింది. బిడ్డను తెచ్చి ఇవ్వలేం కాని అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి. ఈనెల 18న రాహుల్‌గాంధీని మీ ఇంటికి తీసుకువస్తా..అంటూ రేవంత్‌రెడ్డి ఓదార్చారు.

తండ్రి పోషణ ఖర్చు భరిస్తా..

● ప్రతి నెలా రూ.3 వేలు చెల్లిస్తా..
● రాజీకి వచ్చిన కొడుకు..
● వృద్ధ మిత్ర డెస్క్‌లో తొలి కేసు పరిష్కారం



వాదనలు వింటున్న కమిటీ సభ్యులు

హసన్‌పర్తి: వృద్ధాప్యంలో ఉన్న తండ్రి పోషణ ఖర్చు భరిస్తానని కొడుకు రాజీకి వచ్చాడు. హనుమకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృద్ధ మిత్ర డెస్క్‌లో తొలి కేసు పరిష్కారమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లికి చెందిన రైతు పైలా నరసింహారెడ్డికి శివరామిరెడ్డి ఒక్కరే కొడుకు. ప్రస్తుతం శివరామిరెడ్డి భార్యా పిల్లలతో కలిసి హనుమకొండ విద్యారణ్యపురికాలనీలో నివాసముంటున్నాడు. అయితే తన కుమారుడు పోషించడం లేదని నరసింహారెడ్డి కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఆదివారం ఎస్సై బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో తండ్రీ కొడుకులను పిలిపించారు. వృద్ధ మిత్ర స్వచ్ఛంద సంస్థ కమిటీ సభ్యులు ఇరువురి వాదనలు విన్నారు. చివరికి తండ్రి పోషణ నిమిత్తం నెలకు మూడు వేలు ఇవ్వడానికి ఒప్పుకున్న కుమారుడు.. అక్కౌంట్‌లో జమ చేస్తానని చెప్పాడు. అలాగే రెండెకరాల భూమికి సంబంధించి తండ్రి పేర పట్టా జారీ చేసే విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదని శివరామిరెడ్డి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చాడు. కార్యక్రమంలో వృద్ధ మిత్ర స్వచ్ఛంద సంస్థ కమిటీ సభ్యులు అనుమాండ్ల ప్రభాకర్‌రెడ్డి, బొనగాని లింగయ్య, బూర సుజాత, లక్ష్మీ నారాయణ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నయింనగర్: 'లాల్ – నీల్ మైత్రీ వేదిక' ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో 'మార్క్స్– అంబేడ్కర్ మన మార్గదర్శులు' పుస్తకావిష్కరణ సభ, సదస్సు ఆదివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో జరిగింది. ఈ పుస్తకాన్ని విద్యావేత్త గంటా రాంరెడ్డి ఆవిష్కరించారు. ప్రధాన వక్త ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా మాట్లాడుతూ కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు కలిసి పనిచేయాల్సిన అవసరముందన్నారు. భారత్ బచావో ఎన్‌వీసీ డాక్టర్ ఎంఎఫ్ గోపినాథ్ మాట్లాడుతూ కులం ప్రజాస్వామ్యానికి, సమాజానికి, సమానత్వానికి వ్యతిరేకమన్నారు. బొజ్జా భిక్షమయ్య మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం ప్రమాదకరంగా మారిందన్నారు. చక్రపాణి, రాజమౌళి, హంసారెడ్డి, రేఖా చంద్రశేఖర్‌రావు, చంద్రమౌళి, మార్క్స శంకర్‌నారాయణ, వీరస్వామి, రామబ్రహ్మం, రవీందర్, బ్రహ్మచారి నిధి, తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల మధ్య ఇసుక లొల్లి

● జయ్యారంలో రూ.10 లక్షలకు వేలం పాడినట్లు సమాచారం



ఆకేరు వాగులో తీసిన కాలువను పూడుస్తున్న జేసీబీ

నెల్లికుదురు: రెండు గ్రామాల మధ్య ఆకేరువాగులో అక్రమ ఇసుక లొల్లి గొడవ తీవ్రస్థాయికి చేరింది. మండలంలోని మునిగలవీడు, నర్సింహులపేట మండలం జయ్యారం రెండు గ్రామాల మధ్య ఉన్న ఆకేరువాగులో అక్రమ ఇసుక రవాణా గొడవ తీవ్రస్థాయికి చేరింది. వాగులో ఆదివారం జయ్యారం గ్రామానికి చెందిన అక్రమ ఇసుక దందా చేయడం కోసం అక్రణదారులు జయ్యారం సైడు వెళ్తున్న వాటర్‌ను మునిగలవీడు వైపు మళ్లించేందుకు జేసీబీతో కట్ట పోస్తుండగా మునిగలవీడు ప్రజలు అడ్డుకున్నారు. మేము ఆకేరు వాగులో ఇసుక రవాణా కోసం రూ.10లక్షలకు వేలంలో దక్కించుకున్నట్లు వారు ఆందోళనకు దిగారు. తీసిన కాలువను పూడ్చేదాక మునిగలవీడు వైపు వారు జయ్యారం వైపు వారిని నిలదీశారు. ఈ విషయం అధికారుల వద్దకు చేరినట్లు సమాచారం. వారు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందేనని గ్రామస్తులు అనుకుంటున్నారు.

జాతీయ క్రీడలకు అంపైర్‌గా రాజేందర్



కేసముద్రం: గోవాలో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ క్రీడలకు అంపైర్‌గా ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పీఈటీ కొమ్ము రాజేందర్ ఎన్నికైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రమేష్‌కుమార్, పీ.రమేష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ కొమ్ము రాజేందర్‌ను అసోసియేషన్ సభ్యులు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

● ఆరుగురి అరెస్ట్, ఇద్దరు పరారీ

ఖిలావరంగల్: మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధి తిమ్మాపురం గ్రామశివారు జక్కలొద్దిలోని ఓ రహస్య ప్రదేశంలో పేకాట స్థావరంపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేశారు. దాడిలో ఇద్దరు పరారు కాగా ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నామని ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జక్కలొద్ది సమీపంలోని ఓ రహస్య ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసుదన్ ఆదేశాల మేరకు ఆదివారం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ ఆధ్వర్యంలో పేకాటస్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో పోశాల రాజు, మాచర్ల వెంకన్న పరారు కాగా తిమ్మాపురం గ్రామానికి చెందిన మండల అరుణ్, మండల రాజ్‌కుమార్, మానుపాటి సతీష్, మేకల సతీష్, అంబటి ఉదయ్‌కుమార్, మేరుగు రాజులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.53,750 నగదు, 6 స్మార్ట్‌ఫోన్లు, 4 బైకులు, 1 ఆటో, పేకముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం తదుపరి చర్యలు నిమిత్తం కేసును మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల బయోడేటా..

శాసన సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నర్సంపేట, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. వారి బయోడేటా వివరాలు..

భూపాలపల్లి

అభ్యర్థి పేరు : గండ్ర సత్యనారాయణరావు
పుట్టిన తేదీ: 10.06.1965
తల్లిదండ్రులు: సుశీల, సమ్మారావు
సంతానం: ఆశ్విని, అనూష
ఇంటి నంబర్:3–12/5
గ్రామం: బుద్దారం, గణపురం (మం)
జిల్లా: జయశంకర్ భూపాలపల్లి
రాజకీయ ప్రస్థానం: 1988–95 వరకు బుద్దారం సర్పంచ్, 1995–99 వరకు గణపురం జెడ్పీటీసీ (టీడీపీ)

- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ, టీడీపీ పొత్తులో బీజేపీ నుంచి పోటీ. 57,530 ఓట్లు సాధించి రెండో స్థానం సాధించారు.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి నుంచి ఏఐఎఫ్‌బీ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి 54,283 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన మాజీ స్పీకర్ మధుసూదనాచారిని మూడో స్థానానికి పరిమితం చేశారు.

నర్సంపేట

పేరు: దొంతి మాధవరెడ్డి
వయసు: 62 (1961)
గ్రామం: అమీనాబాద్
మండలం : చెన్నారావుపేట
జిల్లా: వరంగల్
భార్య: శాలినిరెడ్డి
కుమారుడు: అవియుక్తా రెడ్డి
కుమార్తె: అనన్యరెడ్డి
రాజకీయం: 1981నుంచి 1988 వరకు అమీనాబాద్ సర్పంచ్ (మండలం చెన్నారావుపేట), 1981 నుంచి 2014 సింగిల్‌విండో చైర్మన్ పీఏసీఎస్ చెన్నారావుపేట, 1995 నుంచి 2000 వరకు వరంగల్ డీసీసీబీ చైర్మన్, 2012 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, 2014 నుంచి 2018 వరకు నర్సంపేట ఎమ్మెల్యేగా కొనసాగారు.

స్టేషన్‌ఘన్‌పూర్

పేరు : సింగపురం ఇందిర
తండ్రిపేరు: దేవదానం
పుట్టిన తేదీ: 30.07.1968
కులం : ఎస్సీ (మాదిగ)
విద్యార్హతలు: ఎంఏ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్
వృత్తి: సీఎండీ ఆఫ్ 17 న్యూస్ ఛానల్, అలేఖ్య ఫామ్స్, రాజ్ ఇండ్రస్ట్రీస్, అభిషాల్ ఫామ్స్, క్రీస్తు కృప ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, క్రీస్తు కృప బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్, సెక్రటరీ ఆఫ్ పావని ఎడ్యుకేషనల్ మెడికల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ
పార్టీలో ప్రస్తుత హోదా: టీపీసీసీ జనరల్ సెక్రటరీ, పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఏపీ కాంగ్రెస్ కమిటీ జాయింట్ సెక్రటరీ, మహిళా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా కమిటీ సెక్రటరీ, మహిళా కాంగ్రెస్ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, ఏపీఎస్‌ఆర్‌టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్
పార్టీలో చేపట్టిన పదవులు: ఎస్ఎస్‌యూఐ నిజామాబాద్ డిగ్రీ కళాశాల జనరల్ సెక్రటరీ, హైదరాబాద్ సిటీ కాంగ్రెస్ సెక్రటరీ, ఆల్ ఇండియా రాజీవ్ యువసేన సెక్రటరీ, ఏపీ హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ, సొసైటీ ఫర్ సేఫ్టీ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్, వరంగల్ జిల్లా హరిజన సేవా సంఘం జిల్లా ప్రెసిడెంట్, ఏపీ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ, ఏపీ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఘన్‌పూర్‌లో పోటీ

ములుగు

పేరు : ధనసరి సీతక్క
భర్త : రాము
కుమారుడు: సూర్య
తల్లి: సమ్మక్క
తండ్రి: సమ్మయ్య
గ్రామం: జగ్గన్న పేట
రాజకీయ రంగ ప్రవేశం: 2002, 2004లో పొదెం వీరయ్యపై టీడీపీ తరుపున పోటీ చేసి ఓటమి చెందారు. 2009లో పొదెం వీరయ్యపై గెలుపు, 2014లో మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్ చేతిలో ఓటమి, 2018లో చందూలాల్ పై గెలుపు

- 1952 నుంచి 2018 సంవత్సరం వరకు జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన మహిళల్లో కేవలం సీతక్క ఒక్కరే గెలుపొందారు. సిట్టింగ్ మంత్రి చందూలాల్‌పై 22, 371 భారీ మెజారిటీతో రెండోసారి గెలుపొందారు.

'గులాబీ' గూటికి పొన్నాల..

● సతీసమేతంగా ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన లక్ష్మయ్య



జనగామ: టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య 'గులాబీ' కోటలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. జనగామ టికెట్ దక్కదనే బలమైన సంకేతాలతో పార్టీకి రాజీనామా చేసిన ఆయన.. బీసీ నేతగా తనకు జరిగిన అన్యాయంపై గళమెత్తుతూ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఇదే క్రమంలో మంత్రి కేటీఆర్ స్వయంగా పొన్నాల ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించిన సంగతి తెలిసిందే. దీంతో ఆదివారం పొన్నాల సతీసమేతంగా ప్రగతి భవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను కలవడంతో చేరిక లాంఛనంగా మారింది. పొన్నాలకు సీఎం కేసీఆర్ స్వాగతం పలికి.. జనగామ నియోజకవర్గ రాజకీయ పరిణామాలపై బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి చర్చించినట్లు సమాచారం. పొన్నాల చేరికతో పార్టీకి లాభం జరుగుతుందని గులాబీ కేడర్ భావిస్తోంది.

కష్ట కాలంలో పెద్ద దిక్కు..

40 ఏళ్లకు పైగా తన రాజకీయ జీవితంలో కాంగ్రెస్‌కు వెన్నంటి ఉంటూ.. కష్ట కాలంలో పెద్ద దిక్కుగా ఉన్న పొన్నాల.. గులాబీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ స్థాయికి ఎదుగుతున్న బీఆర్‌ఎస్‌లో పొన్నాల చేరిక చర్చనీయాంశంగా మారింది. డాలర్ లక్ష్మయ్యగా కాంగ్రెస్‌లో చేరిన ఆయన.. రాష్ట్రం నుంచి ఢిల్లీ వరకు ఎమ్మెల్యే, మంత్రి, జాతీయ స్థాయిలో పదవులు అధిష్టించారు. మహానేత, దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డికి అత్యంత విధేయుడిగా ఉన్న పొన్నాల, నేడు అదే పార్టీలో ఒంటరి కావడంతో తన రాజకీయ భవిష్యత్‌ను మరో పార్టీతో పంచుకోనున్నారు. కాగా, జనగామ జిల్లా కేంద్రంలో సోమవారం జరగనున్న కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్‌తో కలిసి పొన్నాల హెలికాప్టర్‌లో రానున్నారు. అనంతరం సీఎం సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్నారు.

జంగ్ తెలంగాణ

టిఫిన్ బాక్స్‌లు, వాటర్ బాటిళ్ల పట్టివేత



దాడుల్లో లభించిన టిఫిన్‌బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు, బ్యాగులు

వర్ధన్నపేట: మండలంలోని ఉప్పరపల్లిలో ఎన్నికల ప్రత్యేక స్క్వాడ్ బృందం ఆదివారం తనిఖీలు చేపట్టింది. వచ్చే ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి టిఫిన్స్ బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచారనే సమాచారం మేరకు ఎన్నికల ప్రత్యేక స్క్వాడ్ బృందం.. సర్పంచ్ ఆరెల్లి శ్రవంతి అంజన్‌రావు ఇంట్లో దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 16 టిఫిన్ బాక్స్‌లు , 4 వాటర్ బాటిళ్లు , 4 బ్యాగులు లభించగా వాటిని స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించామని ఎన్నికల అధికారి తెలిపారు.

నగరంలో వాహన తనిఖీలు

రామన్నపేట : ఎన్నికల కోడ్ నేపథ్యంలో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ కొత్తవాడ బస్టాండ్ వద్ద మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు ఎఫ్‌ఎస్‌టీ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పలయ్య వద్ద నుంచి రూ. 61వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు.